క్లుప్తంగా

అలరించిన వాణి కథక్ నృత్య ప్రదర్శన

తుక్కుగూడ: మున్సిపల్ పరిధిలోని శ్రీనగర్ (గార్డేనియా గ్రోవ్ విల్లాస్ రాంకీ డిస్కవరీ సిటీ)కి చెందిన కథక్ నృత్య కళాకారిణి మామిడిపల్లి వాణి సోమవారం నగరంలో నిర్వహించిన నృత్య ప్రదర్శనలో విజేతగా నిలిచారు. బిర్లా సైన్స్ సెంటర్– భాస్కర్ ఆడిటోరియంలో అద్భుత నృత్యంతో అబ్బురపర్చారు. నిర్వాహకులు ఆమెకు మెమెంటో అందజేసి సన్మానించారు.

నిధుల కేటాయింపునకు వినతి



ఈస్ట్‌జోన్ కమిషనర్ పంకజకు సమస్యలు వివరిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ సమగ్రాభివృద్ధికి నిధులు కేటాయించి సహకరించాలని ఎల్‌బీనగర్ ఈస్ట్‌జోన్ కమిషనర్ పంకజను కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి కోరారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జోనల్ కమిషనర్‌కు పలు సమస్యలను వివరించి వినతిపత్రం అందజేశారు. అంబేడ్కర్‌నగర్, భగత్‌సింగ్‌నగర్, విజయపురికాలనీ, లక్ష్మీనగర్, ఎస్‌బీఐకాలనీల్లో పెండింగ్ పనులు పూర్తి చేయాలని కోరారు. పోచమ్మబాగ్, వెంకటేశ్వరకాలనీ, కృష్ణానగర్, క్రాంతినగర్, శంకర్‌నగర్‌లలో భూగర్భ డ్రైనేజీ పనుల కోసం అడ్డంగా తవ్వి వదిలేశారని, దీంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని తెలిపారు. వెంటనే కొత్త రోడ్డు నిర్మాణం పనులు చేపట్టాలని, శంకర్‌నగర్, భగత్‌సింగ్‌నగర్, లక్ష్మీనగర్ పెండింగ్ కమ్యూనిటీహాళ్ల నిర్మాణం పనులు వేగవంతం చేయాలని, విజయపురికాలనీ, జేబీకాలనీల్లో నాలా పనులు పూర్తి చేయాలని కోరారు.

దాసర్లపల్లి కాంగ్రెస్ కమిటీ ఎన్నిక



కాంగ్రెస్ కమిటీని అభినందిస్తున్న నాయకులు

కందుకూరు: మండల పరిధిలోని దాసర్లపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఎండీ ఖాజామియా, ఉపాధ్యక్షులుగా రాజుముదిరాజ్, బాల్‌రాజు, ప్రధానకార్యదర్శిగా యాదయ్యతో పాటు కార్యదర్శులు, సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లింగమయ్య, కందూరి యుగంధర్‌గౌడ్, తిరుపతయ్య, ఎండీ రహీజ్, ఇస్మాయిల్, ఎ.రాజు, ఎం.శేఖర్, షబ్బీర్, పాష, అలీ, ఖాదర్, శేఖర్ పాల్గొన్నారు.

ఉపేందర్‌రెడ్డికి సన్మానం

దిల్‌సుఖ్‌నగర్: ఎల్‌బీనగర్‌లోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో శివ స్వాముల సన్నిధానం కోసం షెడ్ నిర్మించిన రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ చిలుక ఉపేందర్‌రెడ్డిని సోమవారం శివ స్వాములు సన్మానించారు. ఈ సందర్భంగా శివశక్తి నిత్య అన్నదాన సేవ సమితి అధ్యక్షుడు గురుస్వామి కాటం రాజు మాట్లాడుతూ.. ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో శివస్వాముల సన్నిధానం కోసం అనువైన స్థలం కావాలని ఉపేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీంతో షెడ్డు నిర్మాణం, ఫ్లోరింగ్ కూడా సిద్ధం చేశారని తెలిపారు. కార్యక్రమంలో రాజేశ్‌కుమార్, వెంకటేశ్, జగదీశ్, బాలకృష్ణ, కుమార స్వామి, మల్లేశ్, సంజయ్, సైదులు, బాలరాజు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ సమావేశం వాయిదా

దిల్‌సుఖ్‌నగర్: నేడు(మంగళవారం) నిర్వహించాల్సిన మహేశ్వరం నియోజకవర్గ బీఆర్‌ఎస్ సమావేశం వాయిదా పడింది. జిల్లెలగూడలోని సామ యాదిరెడ్డి గార్డెన్(ఎస్‌వైఆర్) గార్డెన్‌లో విస్తృత స్థాయి సమావేశం ఉండగా వాయిదా పడినట్లు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి సమావేశ తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్/సరూర్‌నగర్/వనస్థలిపురం: రైతుబజార్లలో కూరగాయల ధరలు(కిలో) ఇలా ఉన్నాయి. టమోటా లోకల్ రూ.23, వంకాయ రూ.18, బెండ రూ.50, పచ్చిమిర్చి రూ.40, కాకర రూ.45, బీర రూ.40, క్యాలీఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.23, క్యారెట్ రూ.25. దొండ రూ.45, ఆలు రూ.21, ఉల్లి రూ.19, గోకర రూ.50, దోస రూ.18, సొర రూ.11, పొట్ల రూ.13, అరటి రూ.9, చిక్కుడు రూ.35, అర్వి రూ.60, మునగ రూ.75, చిలగడదుంప రూ.60, బీట్‌రూట్ రూ.23, కీర రూ.25, ఫ్రెంచ్ బీన్స్ రూ.40, కాప్సికమ్ రూ.60.

సర్పంచ్‌లకు సెలవు... అధికారుల కొలువు

- పల్లెల్లో ప్రత్యేక పాలన
- బాధ్యతలు చేపట్టిన అధికారులు
- పలుచోట్ల రెండు గ్రామాలకు కలిపి ఒక్కరే ప్రత్యేకాధికారి
- గ్రామాభివృద్ధిలో మాజీ సర్పంచ్‌ల పాత్ర కీలకం



ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ నవత

మహేశ్వరం: సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో మండలంలో గ్రామ పంచాయతీలు ప్రత్యేక ప్రత్యేకాధికారుల పాలనలో కొనసాగుతున్నాయి. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు జాప్యం చేయడంతో గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక పాలన తప్పని సరైంది. జిల్లా కలెక్టర్, పంచాయతీరాజ్ అధికారుల ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారులుగా బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం ప్రత్యేకాధికారుల పాలనను తీసుకురావడంతో ఇప్పటివరకు వినియోగించిన డిజిటల్ కీ లను సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌ల నుంచి ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలో చాలా చోట్ల డిజిటల్ కీ లు అధికారుల చేతిలోనే ఉన్నాయి. ఇప్పటివరకు సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు ఉన్న చెక్ పవర్ ఇక నుంచి పంచాయతీ కార్యదర్శి, గ్రామ ప్రత్యేకాధికారులకు జాయింట్ చెక్ పవర్‌ను కల్పించేందుకు కసరత్తు ప్రారంభించారు.

బాధ్యతలు చేపట్టిన అధికారులు వీరే

మహేశ్వరం మండలంలోని మొత్తం 31 గ్రామ పంచాయతీలకు 18 మంది గెజిటెడ్ ప్రత్యేకాధికారులను ప్రభుత్వం నియమించింది. మేజర్ గ్రామ పంచాయతీలకు ఒక్కో ప్రత్యేకాధికారిని నియమించి, చిన్న గ్రామ పంచాయతీలకు రెండింటికి కలిసి ఒక్కో అధికారిని నియమించారు. మహేశ్వరం–నర్సింహ (ఎంపీడీఓ), అమీర్‌పేట్–మహమూద్ అలీ (తహసీల్దార్), నాగారం, పడమటి తండా–వి.నవత (డిప్యూటీ తహసీల్దార్), తుమ్మలూరు, మొహబ్బత్‌నగర్–రవీందర్‌రెడ్డి (ఎంపీఓ), సిరిగిరిపురం, గంగారం– షభానా హెస్సెన్ (ఐసీడీఎస్ సీడీపీఓ), దుబ్బచర్ల, సుభాన్‌పూర్–సిహెచ్.రామ్‌ప్రసాద్‌రెడ్డి(ఏఈ–పంచాయతీరాజ్), మన్సాన్‌పల్లి, ఉప్పుగడ్డ తండా–వి.సృజన (ఏఈ–ఆర్‌డబ్ల్యూఎస్), కోళ్లపడకల్, దిల్‌వార్‌గూడ–డి.నాగమణి (ఏఓ– వ్యవసాయ శాఖ), పెండ్యాల్, కల్వకోల్– కేసీ విశ్వేశ్వర్ (పశువైద్యాధికారి), ఘట్టుపల్లి, ఆకన్‌పల్లి–పి.అరుణ్ కుమార్ (ఏఈఈ), గొల్లూరు, హబీబుల్లాగూడ– టి.సీతారామయ్య (డీఈఈ),పెద్దమ్మ తండా, చిన్న తూప్ర–వై.సౌమ్య (ఉద్యానవన అధికారి), నాగుల్‌దోని తండా, కొత్వాల్ చెర్వు తండా–బిఎస్. రోహిత్ మోజెస్ (ఏఈఈ), నందుపల్లి, డబిల్‌గూడ–వై.శ్రీనివాస్‌రెడ్డి (డిఈఈ), పోరండ్ల– గోవిందు (ఏఈఈ), హర్షగూడ–గిరిశ్ దేశ్‌ముఖ్ (పశువైద్యాధికారి), నాగిరెడ్డిపల్లి–పి.యాదగిరి(ఏఓ–టెక్నికల్), రామచంద్రగూడ–సీహెచ్. విజయ (ఏఈఈఆర్‌అండ్‌బీ) మొత్తం 18 మంది గెజిటెడ్ అధికారులను నియమించారు.

గ్రామాభివృద్ధిలో ప్రత్యేక ముద్ర

గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేయడంలో సర్పంచ్‌లు కీలకంగా పని చేశారు. పల్లె ప్రగతిలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీలో డంపింగ్ యార్డు, పల్లె ప్రకృతి వనం, నర్సరీలు, వైకుంఠధామం, ట్రాక్టర్, ట్యాంకర్, ట్రాలీ, గ్రామీణ క్రీడా పార్కులు, పారిశుద్ధ్య పనులు చేపట్టి గ్రామాల్లో ప్రత్యేక ముద్ర వేశారు. ప్రభుత్వం నుంచి నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో సొంత నిధులతో అభివృద్ధి పనులు చేపట్టారు.

ప్రత్యేక ముద్ర వేశాం



ఐదేళ్లలో గ్రామాన్ని అభివృద్ధి చేశామనే తృప్తి ఉంది. మా హయాంలో గ్రామాల్లో వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలు, నర్సరీలు, ట్రాక్టర్లు, ట్రాలీలు, ట్యాంకర్లు కొనుగోలు చేశాం. చిరస్థాయిగా నిలిచిపోయేలా అభివృద్ధి చేశాం.

– థామస్‌రెడ్డి, మాజీ సర్పంచ్, కల్వకోల్

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



గ్రామాభివృద్ధిలో మా పాత్ర ఎప్పటికీ మరువలేం. అధికారులు, గ్రామస్తులు, రాజకీయాల పార్టీల నాయకులు, సిబ్బంది సహకారం అందించారు. కొత్త ప్రభుత్వం సర్పంచ్‌లకు రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలి.

– మాసారం చంద్రయ్య గౌడ్, మాజీ సర్పంచ్, మాణిక్యమ్మగూడ

సహకరించండి



ఎన్నికలయ్యేంత వరకు ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతుంది. మండలంలో మొత్తం 31 గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులుగా నియమించాం. గ్రామాల్లో ప్రత్యేకాధికారులకు ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులతో పాటు ప్రజలు సహకరిస్తే మరింత అభివృద్ధి జరుగుతుంది.

– నర్సింహ, ఎంపీడీఓ, మహేశ్వరం

సమ్మె నోటీసు



ఆర్డీఓకు సమ్మె నోటీసు అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

కందుకూరు: ఈ నెల 16న దేశవ్యాప్తంగా చేపట్టనున్న గ్రామీణ బంద్‌లో పాల్గొననున్నట్లు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్న భోజన కార్మికులు ఆర్డీఓ సూరజ్‌కుమార్, ఎంఈఓ మనోహర్‌కు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వడం లేదని విమర్శించారు. ఉపాధిహామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్ర పన్నుతుందని ఆరోపించారు. కార్మికుల హక్కులను హరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 16న నిర్వహించే గ్రామీణ బంద్‌లో అన్ని వర్గాల ప్రజలు, రైతులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు కల్యాణ్‌కార్ శ్రీనివాస్, కిషన్‌జీ, అశ్విని, అండాలు, కళమ్మ, సుజాత, లావణ్య, విజయ, హైమావతి, జంగమ్మ, శైలజ, మంగ, లలిత పాల్గొన్నారు.

ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు



మిథులానగర్‌లో భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న మేయర్ దుర్గ

మీర్‌పేట: కాలనీల్లో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని మీర్‌పేట కార్పొరేషన్ మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్ తెలిపారు. 15వ డివిజన్ మిథులానగర్ కాలనీలో రూ.10 లక్షల వ్యయంతో చేపడుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను సోమవారం స్థానిక మహిళలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కార్పొరేషన్‌లోని అన్ని డివిజన్లలో ప్రణాళికాబద్ధంగా మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

విజేతలకు బహుమతులు అందజేత



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

కందుకూరు: కందుకూరు వైఎస్సార్ మినీ స్టేడియంలో నవతరం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ లీగ్ పోటీలు సోమవారం ముగిశాయి. ప్రథమ స్థానంలో నిలిచిన కార్తీక్ జట్టుకు అర్జున అవార్డు గ్రహీత రవికాంత్‌రెడ్డి రూ.25 వేల నగదును తమ ప్రతినిధి ద్వారా అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన అజీజ్ జట్టుకు స్థానిక యూత్ నాయకుడు శివప్రసాద్‌చారి రూ.12,500 నగదు అందజేశారు. కార్యక్రమంలో నవతరం యూత్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

బాచుపల్లిలో..

బాచుపల్లిలో ఎంపీటీసీ సభ్యుడు గుండాల సురేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన జట్లకు గ్రామానికి చెందిన ఎగిరిశెట్టి రాజు రూ.10 వేలు, చౌపల్లి కృష్ణ రూ.6 వేల చొప్పున నగదు అందజేశారు. ఆ జట్లకు ఎగిరిశెట్టి నరేశ్ షీల్డ్‌లను అందించారు. కార్యక్రమంలో యాలాల రాఘవేందర్ పాల్గొన్నారు.

కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి

హస్తినాపురం: కాలనీలో ప్రధాన సమస్యల పరిష్కారంతో పాటు కనీస వసతులు ఏర్పాటు కోసం కృషి చేస్తానని అగ్రికల్చర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం కాలనీలో సంక్షేమ సంఘం కమిటీ సభ్యులతో కలిసి ఆయన పర్యటించారు. సమస్యలను కార్పొరేటర్ సుజాత నాయక్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, కోశాధికారి జితేందర్‌రెడ్డి తదితరులున్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్

వనస్థలిపురం: హస్తినాపురం ఈస్ట్ కాలనీ అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటామని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం హస్తినాపురం ఈస్ట్ కాలనీలో రూ.20.60 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా.. పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు కె.భూపత్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు కృష్ణయ్యగౌడ్, అనంత్‌రెడ్డి, మణెమ్మ, విజయలక్ష్మి, రాజవర్ధన్‌రెడ్డి, సత్తిరెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

త్రిపుర గవర్నర్‌కు శుభాకాంక్షలు



ఇంద్రసేనారెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న సురేందర్‌రెడ్డి

సైదాబాద్: త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డితో పాటు మలక్‌పేట నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇంద్రసేనారెడ్డికి సురేందర్‌రెడ్డి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ సుభాశ్ చందర్జీ తదితరులు పాల్గొన్నారు.

త్రిపుర గవర్నర్‌కు అభినందనలు

మలక్‌పేట: త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని సోమవారం మూసారంబాగ్ బీజేపీ నేతలు మలక్‌పేటలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ భాగ్యనగర్ జిల్లా కోశాధికారి గవర్నర్‌ను సన్మానించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కొప్పుల దినేశ్, జక్కా మోహన్‌రెడ్డి, రాముయాదవ్ పాల్గొన్నారు.

సన్మానం..

ఎల్‌బీనగర్: ఇంద్రాసేనరెడ్డిని కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యుడు కృష్ణాది శేషు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి లక్ష్మీకాంతం, ఎంఎస్‌రాజు, రాంబాబు ఉన్నారు.

డిజిటల్ పుస్తకాలతో విద్యార్థులకు మేలు

తలకొండపల్లి: స్కాన్ అండ్ లర్న్ డిజిటల్ కంటెంట్ పాఠ్య పుస్తకాలతో విద్యార్థులకు పలు ప్రయోజనాలున్నాయని ఐక్యత ఫౌండేషన్ క్రియాశీలక కార్యవర్గ సభ్యుడు నరేందర్‌గౌడ్ అన్నారు. వాటితో అర్థంకాని విషయాలను అర్థమయ్యేంత వరకు చదువుకునే వెసులుబాటు ఉంటుందని ఆయన తెలిపారు. ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సహకారంతో మండల పరిధిలోని వెల్జాల్, ఖానాపూర్, రాంపూర్, పడకల్, చంద్రధన, చుక్కాపూర్, తలకొండపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సోమవారం డిజిటల్ కంటెంట్ పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. గణితం, ఫిజిక్స్, బయాలజీ, సోషల్ పుస్తకాలను ఒక్కో విద్యార్థికి నాలుగు చొప్పున 300 మంది విద్యార్థులకు మొత్తం 1,200 పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా నరేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు మంచి ర్యాంక్‌లు సాధించాలనే ఉద్దేశంతో డిజిటల్ పుస్తకాలు పంపిణీ చేశామన్నారు. డిజిటల్ ప్రపంచాన్ని దృష్టిలో పెట్టుకొని స్కాన్ అండ్ లర్న్ డిజిటల్ కంటెంట్ పుస్తకాలను రూపొందించామన్నా రు. ప్రస్తుత టెక్నాలజీని అనుసరించి పాఠ్య పుస్త కాలలో పాఠ్యాంశాలను లెసన్స్‌గా విభజించి ఒక్కో లెసన్స్‌కు ఒక క్యూఆర్ కోడ్‌ను రూపొందించారు. అక్కడ ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడంతో వీడియో రూపంలో పాఠాలు వినవచ్చు అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, ఫౌండేషన్ సభ్యులు తిరుపతిగౌడ్, మల్లయ్య, మల్లేశ్, మహేశ్, శివ, విజయ్, కల్యాణ్, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

‘వేదిక్ మ్యాథ్స్’లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను సత్కరించిన చైర్మన్ అల్లాజీగౌడ్

ఆమనగల్లు: ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలో నిర్వహించిన వేదిక్ మ్యాథ్స్, అబాకస్ పోటీలలో ఆమనగల్లు పట్టణంలోని లిటిల్ స్కాలర్స్ టెక్నో స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుచుకున్నారు. వేదిక్ మ్యాథ్స్‌లో 7వ తరగతి విద్యార్థి ఐశ్వర్యరెడ్డి ప్రథమ బహుమతి, అబాకస్ పోటీలలో జూనియర్ లెవెల్‌లో మూడో తరగతి విద్యార్థి స్నేహలత, రెండో తరగతి విద్యార్థి లక్ష్మీప్రియలు ప్రథమ, ద్వితీయ బహుమతులు సొంతం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో స్కూల్ ఆవరణలో సోమవారం విద్యార్థులను చైర్మన్ చుక్క అల్లాజీగౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చుక్క అల్లాజీగౌడ్ మాట్లాడుతూ.. పోటీలలో పాల్గొనడం ద్వారా విద్యార్థులలో సామర్థ్యం పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ జిల్లెల సుజాతారెడ్డి, డైరెక్టర్ సావిత్రి, అడ్వైజర్ సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్వేత, హైమావతి, రాధిక, గీత, స్వాతి, శ్రీజన్య, మమత, తేజ, నందిని, చలం, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు యాత్రలో కాంగ్రెస్ నేతలు

ఆమనగల్లు: పాలమూరు ప్రగతి కోసం సీడబ్ల్యూసీ ప్రత్యేకాహ్వానితుడు, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి చేపట్టిన పాలమూరు న్యాయయాత్రలో ఆమనగల్లు, కడ్తాల మండలాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఆరు రోజుల క్రితం చల్లా వంశీచంద్‌రెడ్డి మహబూబ్‌నగర్ పార్లమెంటు నియోజక వర్గంలోని మక్తల్ నుంచి పాదయాత్ర ప్రారంభించారు. సోమవారం నారాయణపేట అసెంబ్లీ నియోజక వర్గ పరిధిలోని దామరగిద్ద మండలంలో యాత్ర సాగింది. ఇందులో పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడురి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, జహంగీర్‌బాబా, వెంకటేశ్, లక్ష్మయ్య, బిక్యానాయక్, హీరాసింగ్‌నాయక్, తులసీరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పర్ణికారెడ్డికి సత్కారం

ఆమనగల్లు: నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డిని ఆమనగల్లు, కడ్తాల మండలాల కాంగ్రెస్ నాయకులు ఘనంగా సత్కరించారు. నారాయణపేట అసెంబ్లీ నియోజక వర్గ పరిధిలోని దామరగిద్ద మండల కేంద్రంలో సోమవారం పాలమూరు న్యాయ యాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డిలను పీసీసీ సభ్యులు అయిల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, బిక్యానాయక్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా అవసరాల కోసమే ట్రంక్‌లైన్ నిర్మాణం

మన్సూరాబాద్: ప్రజా అవసరాల కోసమే ట్రంక్‌లైన్లు నిర్మిస్తున్నామని, ఇందుకోసం మదర్ డైరీ సభ్యులు సహకరించాల్సిందేనని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. హయత్‌నగర్ డివిజన్ పరిధి సిద్ధి వినాయకనగర్‌కాలనీలో జరుగుతున్న ట్రంక్‌లైన్ పనులను జలమండలి జీఎం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ ట్రంక్‌లైన్ మదర్‌డైరీ నుంచి కుంట్లూర్ వరకు కొనసాగుతుందని చెప్పారు. ఎట్టి పరిస్థితిల్లోనూ మదర్‌డైరీ నుంచే ట్రంక్‌లైన్ వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. కార్యక్రమంలో మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, శ్రీధర్‌గౌడ్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మరోసారి ఎమ్మెల్యే చర్చలు

లింగోజిగూడ: ట్రంక్‌లైన్ నిర్మాణ పనుల కోసం ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సోమవారం మదర్ డైరీ సభ్యులతో మరోసారి సమావేశమయ్యారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ విఠల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు చెన్నగోని శ్రీధర్‌గౌడ్, వాటర్ వర్క్స్ అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్, ఇంద్రకరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

చెత్త కుప్పలే!

హస్తినాపురం: ఎల్‌బీనగర్ పరిధిలో అనేక ప్రాంతాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. హస్తినాపురం, చంపాపేట, లింగోజిగూడ, వనస్థలిపురం డివిజన్లలోనూ ఇదే స్థితి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం.. కిందిస్థాయి సిబ్బంది నిర్లక్ష్యంతో రోడ్లపైనే చెత్త పేరుకుపోతోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వనస్థలిపురంలోని క్రాంతి హిల్స్ కాలనీ ప్లేగ్రౌండ్, దానికి ఎదురుగా ఉన్న బహిరంగ ప్రదేశం మందుబాబులకు అడ్డాగా మారిందని స్థానికులు చెబుతున్నారు.



ఓపెన్ ప్లేస్‌లో వ్యర్థాలు



సుష్మా రోడ్డులో పేరుకుపోయిన చెట్ల కొమ్మలు



రోడ్డు మీదే చెట్ల కొమ్మలు



ఇళ్ల మధ్యే పేరుకుపోయిన చెత్త